

పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలో నిశవగల బసవన్నకు, శ్రీబయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం పండితులు శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు.



పంచ రథాలపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం: రథ సప్తమి సందర్భంగా మంగళవారం శ్రీమఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలను అంబారి, వెండి, చెక్క, బంగారు, నవరత్న రథాలపై ఉంచి ఊరేగించారు.



దుఃఖ సాగరం!

సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ మద్దులేటి రెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. శాస్త్రవేత్త మృతికి సంతాపం తెలియజేస్తూ ఆయనతో ఉన్న జ్ఞాపకాలను పలువురు నెమరు వేసుకున్నారు. ..8లో

సాక్షి కర్నూలు

బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025

పేదల ఇళ్లపై గడువు పిడుగు


ఓర్వకల్లు జగనన్న కాలనీలో నిర్మించుకున్న ఇల్లు



17 వేల గృహ నిర్మాణాలపై ప్రభావం ...

'పేదలందరికీ నాణ్యమైన ఇళ్లు.. గృహ నిర్మాణానికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం మంజూరు చేస్తాం. ఇప్పటి వరకు ఇంటి పట్టాలు పొందిన వారికి పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం' ఇది కూటమి పార్టీల నేతలు ఉమ్మడి మేనిఫెస్టోలో పేదలకు ఇచ్చిన హామీ. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచింది. ఇప్పటి వరకు ఇంటి స్థలాలపై ఒక్క దరఖాస్తు తీసుకోకపోగా.. పేదల సొంతింటి కలను కాలరాస్తున్నారు. నిరుపేదలకు అండగా నిలిచి గృహ యోగం కల్పించాల్సిన ప్రభుత్వమే పిడుగు లాంటి గడువు విధించి లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తోంది.

- జగనన్న గృహ నిర్మాణాలకు 'చంద్ర' గ్రహణం
- బిల్లుల చెల్లింపునకు మార్చి 31 వరకు డెడ్‌లైన్
- పీఎంఏవై ఫేజ్ -2 ప్రారంభమవుతుందని హైరానా
- ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- ఆర్థిక పరిస్థితుల రీత్యా జాప్యమవుతున్న నిర్మాణాలు



కర్నూలు(అర్బన్): నవ రత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుపేద వర్గాల సొంతింటి కలను సాకారం చేసేందుకు చేసిన ప్రయత్నాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం భగ్నం చేసేలా నిర్ణయం తీసుకుంది. ఎలాంటి సొంత స్థలం లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలను ఇచ్చి, ఉచితంగా ఇళ్లు నిర్మించుకునేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం జిల్లాలో 291 వైఎస్సార్ జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి దాదాపు 52 వేల గృహాలను మంజూరు చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం జగనన్న కాలనీల పేర్లను పీఎంఏవై ఎన్‌టీఆర్ కాలనీలుగా మార్చడంతో పాటు ప్రస్తుతం ఆయా కాలనీల్లో వివిధ దశల్లో కొనసాగుతున్న నిర్మాణాలను మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేసుకోవాలని ఆదేశించింది. దీంతో ఆర్థిక కష్టాల్లో ఉన్న పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ నెల నుంచి పీఎంఏవై ఫేజ్ -2 ప్రారంభమయితే పీఎంఏవై ఫేజ్ -1 కింద నిర్మిస్తున్న ఇళ్లను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పూర్తి చేసుకోవాలి. లేదంటే ప్రస్తుతం వివిధ దశల్లో కొనసాగుతున్న నిర్మాణాలకు బిల్లులు విడుదల చేసే పరిస్థితి ఉండదనే ప్రచారం జోరందుకోవడంతో ఆయా కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కట్టుకుంటున్న ఇళ్లను పూర్తి చేసుకోకుండానే బిల్లులు నిలిపివేస్తే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల విలువైన స్థలాలను ఉచితంగా ఇచ్చి, నిర్మాణ యూనిట్ విలువ రూ.1.80 లక్షలను తిరిగి చెల్లించే అవసరం లేకుండా చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిది. ఎంతో సమున్నత ఆశయంతో గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ పక్కా గృహాలను మంజూరు చేశారు.

పొదుపు మహిళలకు రూ.127 కోట్లు

ఆర్థిక పరిస్థితుల రీత్యా గృహాలు నిర్మించుకోలేని స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు ఒక్కొక్కరికి రూ.35 వేల ప్రకారం రుణం అందించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు డీఆర్‌డీఏ, పట్టణ ప్రాంతాల్లోని సభ్యులకు మెప్మా ద్వారా రూ. 127 కోట్లను అందించి ఇళ్లను నిర్మించుకునేందుకు ప్రోత్సహించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించకుండా, గడువు పెట్టడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

పీఎంఏవై ఫేజ్ -1 కింద చేపట్టిన గృహ నిర్మాణాలన్నింటిని మార్చి 31వ తేదీ లోపు పూర్తి చేసుకోవాలనే ఉత్తర్వుల ప్రభావం జిల్లాలోని వేర్వేరు కాలనీల్లోని 17 వేల గృహాలపై పడనుంది. బిలో బేస్‌మెంట్ నుంచి రూఫ్ లెవెల్ వరకు ఆయా కాలనీల్లో 17 వేల గృహ నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. వీటన్నింటిని ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి అయ్యే నాటికి నిర్మించుకోవడం సాధ్యం కాని నేపథ్యంలో ఈ నిర్మాణాలకు పూర్తి స్థాయిలో బిల్లులు అందని పరిస్థితి నెలకొనవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మార్చి 31వ తేదీ వరకు ఎక్కడి వరకు నిర్మించుకుంటే, అక్కడి వరకే బిల్లులు వస్తాయనే ప్రచారం జరుగుతోంది. దీనిపై సంబంధిత గృహ నిర్మాణ శాఖకు చెందిన అధికారులు కూడా స్పష్టత ఇవ్వకపోవడం వల్ల లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. గడువు అనంతరం నిర్మించుకునే వాటికి లబ్ధిదారులే తమ సొంత డబ్బులనే వెచ్చించుకోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మౌలిక వసతులకు రూ.35.59 కోట్లు...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న లే ఔట్లలో పేదల ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రూ.35.59 కోట్లను వెచ్చించింది. ఇందులో తాగునీరు, ఇంటి నిర్మాణాలకు అవసరమయ్యే నీటి సరఫరాకు రూ.20.10 కోట్లు, ఆయా కాలనీల్లో అప్రోచ్ రోడ్లకు రూ.1.75 కోట్లు, కాలనీల్లో అంతర్గత రహదారులకు రూ.13.74 కోట్లను వెచ్చించారు. అలాగే విద్యుత్ సౌకర్యానికి అవసరమైన నిధులను విద్యుత్ శాఖకు అప్పట్లోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న కాలనీల్లో అంతర్గత రహదారులు, అప్రోచ్ రోడ్లు, నీటి సౌకర్యం కల్పించడంతో ఆయా కాలనీల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఎలాంటి ఇబ్బంది లేకుండా జీవనం సాగిస్తున్నారు.

ఇంటి నిర్మాణానికి మరింత గడువు పెంచాలి



ఆర్థిక పరిస్థితుల వల్ల ఇంటి నిర్మాణ పనులు చేపట్టలేకపోతున్నాం. నా భర్త లారీ డ్రైవర్‌గా పనిచేస్తు చాలీచాలని జీతంతో కుటుంబ పోషణ కూడా చాలా భారంగా ఉంది. దీనికి తోడు పిల్లల చదువులు, అడపదడపా వైద్య ఖర్చులు పెరిగిపోతున్నాయి. సొంతంగా ఇల్లు నిర్మించుకోవాలనే ఆశ ఉన్నా, అంతంతమాత్రంగా ఉన్న ఆర్థిక పరిస్థితుల వల్ల ఇంటి నిర్మాణంలో కొంత జాప్యం జరుగుతోంది. పేదల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మార్చి నెల తరువాత నిర్మించుకునే ఇళ్ల నిర్మాణాలకు కూడా బిల్లులు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది.

– జీకే మాధవి, గార్గేయపురం, కర్నూలు మండలం

మార్చి నెలాఖరులోగా పూర్తి చేయలాంటే ఎలా



జగనన్న కాలనీల్లోని ఇళ్లను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసుకోవాలని, లేని పక్షంలో బిల్లులు రావని చెప్పడం భావ్యం కాదు. పలు రకాల కారణాల వల్ల పేదలు గృహాలు నిర్మించుకోవడంలో కొంత మేర జాప్యం జరిగింది. అంత మాత్రానా ఇప్పటికిప్పుడు గృహాలను పూర్తి చేసుకోవాలంటే సాధ్యమయ్యే పనికాదు. వారి ఆర్థిక పరిస్థితులను బట్టి వారు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలి.

– ప్రభాకర్‌రెడ్డి, లొద్దిపల్లె, ఓర్వకల్లుమండలం

బిల్లు మొత్తం ఇవ్వాల్సిందే



జగనన్న లేఅవుట్‌లో 249వ నెంబర్‌లో ప్లాట్‌లో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాం. ఆర్థిక పరిస్థితి బాగా లేక ఇంటి నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేశాం. ప్రస్తుతం మార్చి నెలాఖరు లోగా పూర్తి చేసుకుంటేనే బిల్లులు విడుదలవుతాయని చెబుతున్నారు. రెండు నెలల్లో పూర్తి స్థాయిలో ఇంటిని నిర్మించుకోవడం కష్టసాధ్యం. మరి కొంత సమయం ఇస్తే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకుంటాం. గడువుతో సంబంధం లేకుండా బిల్లులను కూడా విడుదల చేయాలి.

– వైకె లావణ్య, ఓర్వకల్లు

న్యూస్‌రీల్

జెడ్పీలో ఎనిమిది మందికి పదోన్నతి



పదోన్నతి పొందిన వారితో జెడ్పీ చైర్మన్, సీఈఓ

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ పరిధిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది జూనియర్ అసిస్టెంట్లు/ టైపిస్టులకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఆర్డర్స్‌ను అందించినట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ చైర్మన్ చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి పోస్టింగ్ ఆర్డర్స్‌ను అందించారన్నారు. పదోన్నతి పొందిన వారిలో వై రవికాంత్‌రెడ్డిని తుగ్గలి ఎంపీపీ కార్యాలయానికి, డీ భారతిని నంద్యాల పీఆర్‌ఐ డివిజన్‌కు, పీ కిరణ్ ప్రసాద్ శర్మను కర్నూలు పీఐయూ డివిజన్‌కు, బీ నాగరాజుకుమారిని ఆదోని పీఆర్‌ఐ డివిజన్‌కు, వీ రాజ్యలక్ష్మిని ఆత్మకూరు పీఐయూ సబ్ డివిజన్‌కు, ఎం శ్యామలను గోనెగండ్ల ఎంపీపీ కార్యాలయం, బీ జ్యోతిప్రభను కర్నూలు పీఐయూ డివిజన్‌కు, వీ శ్రీధర్‌ను ఆదోని పీఐయు సబ్ డివిజన్‌కు పోస్టింగ్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంట్ల అర్హత, వారి అభీష్టం మేరకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించామన్నారు.


ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం క్యాన్సర్ ఈ స్థాయిలో లేదని, నేడు కలుషిత గాలి, నీరు, ఆహారం తీసుకోవడం వల్ల క్యాన్సర్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రతి మంగళ, గురువారాల్లో ప్రత్యేకంగా ప్రీవెంటివ్ ఆంకాలజీ ఓపీ(222) నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ త్వరలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రీవెంటివ్, థిరాపాటిక్, పాలియేటివ్ సేవలు అందిస్తామన్నారు. అంతకు ముందు క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే. ప్రకాష్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, డాక్టర్ బి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండలి పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీలో ఇసాక్‌కు చోటు



బొమ్మలసత్రం: శాసన మండలిలో 2024-25 సంవత్సరానికి గాను ఏర్పాటు చేసిన మూడు ఆర్థిక కమిటీల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాకు చోటు కల్పించినట్లు రాష్ట్ర శాసనసభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. శాసనసభ, శాసనమండలిలో పార్టీల సభ్యుల రేషియో ఆధారంగా వైఎస్సార్‌సీపీ తరుపున ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాతో పాటు మరో ఎమ్మెల్సీ డాక్టర్ కుంబా రవిబాబును నియమించారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

కల్లూరు: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఉలిందకొండ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాల వివరాలు, కేసులపై ఆరా తీశారు. విధుల్లో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కర్నూలు తాలూకా రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ ధనుంజయ ఉన్నారు.

ప్రాక్టికల్ పరీక్షల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

- ఆర్ఐఓ గురవయ్య శెట్టి




సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియెట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి

కర్నూలు సిటీ: ఇంటర్మీయెట్ ప్రాక్టికల్ పరీక్షల్లో పొరపాట్లకు తావివ్వొద్దని ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి, జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టౌన్‌మోడల్ జూనియర్ కాలేజీలో ప్రాక్టికల్ పరీక్షలపై సైన్స్ లెక్చరర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం నుంచి వొకేషనల్ విద్యార్థులకు ఈ నెల 10వ తేదీ నుంచి జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. పరీక్షల్లో అక్రమాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్ష జరిగే రోజున ప్రశ్నా పత్రం గంట ముందుగానే ఇన్విజిలేటర్లకు వెబ్‌సైట్ ద్వారా పంపుతామని, అర గంట ముందుగా దానిని డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు అందజేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఉంటుందని, అలాగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా స్పెషల్ ఆఫీసర్ లాలెప్ప, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు నాగభూషణ రెడ్డి, యు.పద్మావతి, జీఎస్ సురేష్ చంద్ర, ప్రిన్సిపాల్ సుంకన్న, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మురళీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

- కలెక్టర్ రంజిత్‌బాషా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (హాస్పిటల్): జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 10వ తేదీన విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 10వ తేదీన జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 1 నుంచి 19 సంవత్సరాల లోపు విద్యార్థులందరికీ నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. అలాగే హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు కూడా వేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకోసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కడుపులో నులిపురుగులు ఉండటం వల్ల చదువులో ఏకాగ్రత లోపించడం, రక్తహీనత, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరేచనాలు, బరువు తగ్గడంతో పాటు అనేక రకాల ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా?

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సోషల్ మీడియా యాక్టివిస్ట్‌ను పరామర్శించి వస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: 'ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలు, దౌర్జన్యాలను సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా' అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. ఓర్వకల్లు మండలం పాలకొలను గ్రామానికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ రమేష్‌ను మంగళవారం కర్నూలు జిల్లా కారాగారంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు, కార్యకర్తలకు, సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షకట్టి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తే గమనిస్తున్న ప్రజలు భవిష్యత్తులో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం.. వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ ప్రజలను దారి మళ్లిస్తోందని ఆరోపించారు. ఆయన వెంట కార్పొరేటర్ నారాయణరెడ్డి, నాయకుడు ఎ.హనుమంతురెడ్డి ఉన్నారు.

రాతి మండపాల సహజత్వాన్ని కాపాడండి

మహానంది: పవిత్ర పుణ్యక్షేత్రమైన మహానందిలో పంచలింగాల రాతి మండపాల సహజత్వాన్ని కాపాడాలని ఆలయ అధికారులను దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్ సూచించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన నిమిత్తం మంగళవారం మహానంది చేరుకుని ఆలయ పరిసరాలను పరిశీలించారు. పారిశుధ్య పనులు మెరుగుపరచాలని ఆదేశించారు. దాతలు అందించిన 1000లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్‌ప్లాంట్ నిరుపయోగంగా ఉండటంపై ఆగ్రహిస్తూ వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అన్నదాన మండపం, అభిషేక మండపాల్లో చీలికలు వచ్చిన వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు.

టీడీపీ దాడులు సిగ్గుచేటు

- పెదొడ్డి బాధితులను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



బాధితుడిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో నారా లోకేష్ రెచ్చగొట్టడంతో టీడీపీ గూండాలు దాడులకు పాల్పడటం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి అన్నారు. 'ఇదేం పైశాచికానందం' అని విమర్శించారు. అధికారం ఎల్ల కాలం ఉండదని టీడీపీ నాయకులు గుర్తు పెట్టుకోవాలన్నారు. కోడుమూరు నియోజకవర్గం సి.బెళగల్ మండలం పెదొడ్డి గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ గూండాలు మూకుమ్మడిగా దాడి చేసిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్‌తో కలిసి ఎస్వీ మోహన్ రెడ్డి పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో నిత్యం ఎక్కడో ఒకచోట టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారన్నారు. పెదొడ్డి గ్రామంలో శుభ కార్యంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కత్తులు, కొడవళ్లు, రాళ్లు, కర్రలపై దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతోపాటు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనన్నారు.

సూర్య దేవా.. నమోస్తుతే!



కర్నూలు నగరంలోని సూర్య భగవాన్ మందిరంలో భక్తులు

ప్రత్యక్ష దైవానికి భక్తజనం ప్రణమిల్లింది. సూర్య దేవుడి స్మరణతో ఆలయాలు హోరెత్తాయి. రథ సప్తమి సందర్భంగా మంగళవారం జిల్లాలో దేవాలయాలు భక్తులతో పోటెత్తాయి. సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో అభిషేకాలు, అరుణ హోమాలు, సూర్య నమస్కారాలు నిర్వహించారు. సూర్య భగవానుడికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయం తదితర ప్రాంతాల్లో కొన్ని ఆలయాల్లో స్వామివార్ల రథాలకు పూజలు చేపట్టారు. పాఠశాలల్లో విద్యార్థులకు భానుడి విశిష్టతను వివరిస్తూ సూర్య నమస్కారాలపై అవగాహన కల్పించారు.

– కర్నూలు (కల్చరల్)

20 రోజుల్లో పెళ్లి.. కబళించిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సురేష్ (ఫైల్)

కోడుమూరు రూరల్: మరో 20 రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విధి ఆడిన వింత నాటకంలో ఆ ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికిచెందిన క్రిష్ణయ్యకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు సురేష్ (21) వ్యవసాయం చేస్తున్నాడు. ఇతనికి ఈనెల 22, 23వ తేదీల్లో పెళ్లి చేయాలని పెద్దలు నిశ్చయించారు. ఇందులో భాగంగా కె.నాగలాపురం సుంకులమ్మ దేవతకు మంగళవారం పూజలు చేసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి సురేష్ వెళ్లాడు. పూజలనంతరం స్వగ్రామానికి బైక్‌పై అవ్వ తిమ్మక్కతో కలిసి బయలుదేరాడు. అయితే విధి చిన్న చూపు చూడడంతో పెంచికలపాడు దాటిన తర్వాత ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తూ ఢీకొనడంతో సురేష్ తో పాటు వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు పక్కనే ఉన్న విశ్వభారతి హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందాడు. వృద్ధురాలిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొద్ది రోజుల్లోనే కుమారుడి పెళ్లి చూడాల్సిన తల్లిదండ్రులు ఈ ఘటనతో గుండెలవిసేలా రోదిస్తున్నారు. దీంతో పి.కోటకొండలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. కె.నాగలాపురం ఎస్ఐ ఆశాలత కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

కృష్ణా రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ



సిల్వర్ మెడల్‌తో నాగార్జున

కర్నూలు కల్చరల్: ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన కృష్ణా రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా స్విమ్మర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నాగార్జున ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన స్విమ్మర్లతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్విమ్మర్లు పాల్గొన్నారు. సుమారు 1.5 కిలోమీటర్ల మేర సాగిన ఈ స్విమ్మింగ్ పోటీల్లో 11- 80 వయసు ఉన్న వారు మొత్తం 600 మంది పాల్గొన్నారు. 30-40 ఏజ్ గ్రూప్‌లో 90 మంది స్విమ్మర్లు పోటీలో పాల్గొనగా కర్నూలుకు చెందిన నాగార్జున 21.16 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకొని ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ నేపథ్యంలో నాగార్జునకు కర్నూలు డీఎస్‌డీఓ భూపతి రావు, స్విమ్మింగ్ కోచ్ నటరాజ్, కర్నూలు డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నరసింహాచార్యులు, రామకృష్ణ యాదవ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్‌కు ఎంపిక



పారా అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్,అధ్యాపకులు

ఎమ్మిగనూరుటౌన్: గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈనెల 2వ తేదీన జరిగిన 7వ రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి పి.బషీర్ ప్రతిభ చాటాడు. 100మీటర్లు, 1500 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సాధించి ఈనెల 17 నుంచి 19వరకు చెన్నైలో జరిగే జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాషా మంగళవారం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ఆ విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్‌లు శీను బాబు, సుధాకర్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

పశుగ్రాసానికి నిప్పు



కాలిపోతున్న వరిగడ్డి గుట్టలు

కొత్తపల్లి: పశువుల కోసమని పొలాల్లో ఉంచిన వరిగడ్డిని గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే...మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామ పొలిమేరలోని చాకలోని గడ్డలు పొలాల్లో రైతులు వరి గడ్డిని గుట్టలుగా వేసి ఉంచారు. త్వరలో ఈ గ్రాసాన్ని ఇంటికి తీసుకెళ్లాల్సి ఉండగా సోమవారం మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆ గడ్డికి నిప్పుపెట్టారు. దీంతో దాదాపు 10 ఎకరాల గ్రాసం కాలిబూడిదైంది. పశువుల మేత కోసం గ్రామానికి చెందిన డి.శివనాగిరెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, మాదిగ రాజన్న, ప్రతాప్‌రెడ్డితో పాటు కొక్కెరంచ నాగరత్నం, సంకిరేణిపల్లె ఓబులేసులు ఆ గ్రాసాన్ని కొనుగోలు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు చేసిన ఈపనికి తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ బిల్లుల షాక్!

- రెండు,మూడింతలు అధికంగా బాదుడు
- చిన్న దుకాణాలకు వేలాది రూపాయల బిల్లులు
- ఎలా చెల్లించాలని గగ్గోలు పెడుతున్న వినియోగదారులు

ఆలూరు రూరల్/కర్నూలు న్యూసిటీ: చలికాలంలోనూ విద్యుత్ బిల్లులు మోత మోగిస్తున్నాయి. ఎన్నికల ముందు తమను గెలిపిస్తే విద్యుత్ చార్జీలు పెంచమని గొప్పలు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన కొద్దినెలల్లోనే చుక్కలు చూపిస్తున్నాడు. ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదారులను బాదుతున్నాడు. దీనికితోడు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేసి దోచుకుంటున్నాడు. గతంలో ఎప్పుడూ లేని విధంగా వస్తున్న బిల్లులను చూసి సామాన్య, మధ్య తరగతి వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. చిన్న తరహా పరిశ్రమలు నిర్వహించే వారి పరిస్థితి చెప్పనక్కర లేదు. స్మార్ట్ మీటర్ అంటేనే హడలెత్తి పోతున్నారు. రెండునెలలుగా వీరికి వస్తున్న విద్యుత్ బిల్లులు చూస్తే షాక్ కొట్టేలా ఉన్నాయి.

☛ ఆలూరు పట్టణానికి చెందిన ఓ వెల్డింగ్ షాపు (సర్వీసు నెంబర్ 8112104004552)నకు విద్యుత్ అధికారులు గత నెలలో స్మార్ట్ మీటర్ బిగించారు. ఈ నెల 1వ తేదీన అతనికి రూ.11,011 వేలు బిల్లు వచ్చినట్లు డిమాండ్ నోటీసు అందించారు. గత ఏడాది నంబర్, డిసెంబర్ నెలలో పాత మీటర్ ఉన్నప్పుడు రూ.6 వేలు





ఆలూరులో వెల్డింగ్ షాపులో స్మార్ట్ మీటర్ బిగించిన తర్వాత రూ.11,011 కరెంట్ బిల్లు వచ్చిన దృశ్యం

కంటే ఎక్కువ బిల్లు వచ్చేది కాదు. ఈసారి బిల్లు ఎందుకు ఎక్కువ వచ్చిందని చూస్తే 462 యూనిట్ల వినియోగానికి ఫిక్స్‌డ్ చార్జీ 975, కస్టమర్ చార్జీ రూ.63, ఎలక్ట్రిసిటీ డ్యూటీ 463, ఎనర్జీ చార్జీలు కింద రూ.8,214, ఎఫ్‌పీపీసీఏ (2002-6) కింద రూ.428, ఎఫ్‌పీపీసీఏ (2023-05) కింద రూ.353, ఎఫ్‌పీపీసీఏ(2025-01) రూ.343 లతో పాటు ట్రూ అప్ చార్జీల కింద రూ. 172 కలిపి మొత్తం రూ.11,011 చెల్లించాలని ఉంది. గత ఏడాది డిసెంబర్ నెలలో 461 యూనిట్లకు రూ. 6వేలు వచ్చిందని, ఇప్పుడు ఒక యూనిట్ మాత్రమే పెరిగిందని, దీనికి ఏకంగా 5వేలు ఎక్కువ వచ్చిందని బాధితుడు జావీద్ తెలిపారు. వచ్చిన ఆదాయం అంతా కరెంటు బిల్లు చెల్లింపులకే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశాడు.కాగా బిల్లు ఎక్కువ రావడంపై ఆలూరు ఏఈ గురప్ప దృష్టికి తీసుకెళ్లగా 'స్మార్ట్ మీటర్లు ఉపయోగించే చిన్న పరిశ్రమల నిర్వాహకులు మోటార్లు, కెపాసిటర్లకు ఆన్ ఆఫ్ స్విచ్చులు ఏర్పాటు చేసుకోవాలి. మిషన్లు ఆఫ్ చేసి కెపాసిటర్లు అలాగే ఉంచితే రీడింగ్ నమోదు అవుతునే ఉంటుంది. వెల్డింగ్ షాప్‌నకు అధిక బిల్లు వచ్చిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా'మన్నారు.

☛ కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీకి చెందిన రాజేష్ రెడ్డి హరి మోటార్స్ అనే కార్ల సర్వీస్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ షాప్‌నకు జనవరికి ముందు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు విద్యుత్ బిల్లు వచ్చేది. జనవరి నెలలో ఏకంగా విద్యుత్ బిల్లు రూ.12,916 వచ్చింది. దీంతో ఇదేం బిల్లు అని విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్మార్ట్ మీటర్ బిగించాము అందుకు తగ్గట్లు కండెన్సర్లు బిగించు కోవాలని బుకాయించి విద్యుత్ బిల్లును బలవంతంగా వసూలు చేశారు. మళ్లీ ఈ నెల ఏకంగా రూ.29,682 బిల్లును కంప్యూటర్ ద్వారా జనరేట్ చేసి ఆన్‌లైన్‌లో పంపారు. దీంతో సదరు దుకాణాదారుడికి దిక్కుతోచడం లేదు. వేల కొద్ది కరెంట్ బిల్లులు



హరి మోటార్స్ సర్వీస్ షాప్‌కు తాజాగా రూ. 29,682 జనరేట్ అయిన విద్యుత్ బిల్లు

వస్తే తాము ఎలా చెల్లించాలని వాపోతున్నాడు. వెంటనే స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తున్నాడు.

ఎస్పీని కలిసిన కాటసాని



కల్లూరు: కర్నూలు జిల్లా నూతన ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్ పాటిల్‌ను ఆయన కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే అందించి అభినందనలు తెలిపారు.

గోబీసెంటర్‌లో షార్ట్‌సర్క్యూట్

నందికొట్కూరు: పట్టణంలోని సుంకులమ్మ గుడి సమీపంలో ఉన్న గోబీ తయారీ కేంద్రంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి రూ. 8 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే... గుడిసమీపంలోని గోడౌన్‌లో ఒక వైపు షేక్ సలాం అనే వ్యక్తి రేష్మా గోబీ సెంటర్ నిర్వహిస్తున్నాడు. మిగతా ఖాళీ ప్రదేశంలో శ్రీరామ సినిమా టాకీస్‌కు చెందిన కుర్చీలు, ఇతర సామాన్లు ఉన్నాయి. మంగళవారం సాయంత్రం గోబీ తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. వెంటనే గమనించి ఆత్మకూరు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే పలు కుర్చీలు, ఇతర సామగ్రి కాలిపోయింది. ప్రమాద స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ బేబి, డీఈ నాసిర్ పరిశీలించారు.

6 నుంచి డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 6వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు డిగ్రీ 1, 2,3, 4,5,6 సెమిస్టర్ల స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాల, నంద్యాల పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ డిగ్రీ కళాశాల, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు, బనగానపల్లె, డోన్, నందికొట్కూరు, శ్రీశైలం, పత్తికొండ, ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఎమ్మిగనూరు ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 1 సెమిస్టర్ 141, 2 - 465, 3 - 276, 4 - 177, 5 - 652, 6- 770 మొత్తం 2481 మంది విద్యార్థులు 8004 పేపర్స్ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

అదేరోజు నుంచే బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు

రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 6 నుంచి 17వ తేదీ వరకు బీఈడీ 1, 2,3, 4 సెమిస్టర్ల స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాల, నంద్యాల పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ డిగ్రీ కళాశాల, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల, బనగానపల్లె, డోన్, నందికొట్కూరు, పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఎమ్మిగనూరు ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 1వ సెమిస్టర్ 131, 2 - 20, 3 - 72, 4 - 54 మొత్తం 277 మంది విద్యార్థులు 733 పేపర్స్ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణ పనులు

- అడ్డుకున్న మహిళలు

అవుకు: టీడీపీ నాయకులు ఆ పార్టీకి చెందిన వ్యక్తుల కోసం లేని రస్తాలను సృష్టించి దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని అవుకు మండలం మెట్టుపల్లె గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్టుపల్లె గ్రామంలోని ఈడిగ బజార్ నుంచి ఎస్సీ కాలనీలో ఉన్న ప్రధాన రహదారిలోకి వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగవారం రాత్రి అడ్డుకున్నారు. మెట్టుపల్లె గ్రామానికి చెందిన ఎగ్గోని లచ్చమ్మ, ఎర్రక్క, వరాలు, మేనక, రాణి కుటుంబాలకు ఈడిగ బజార్ ఆనుకుని బైలు స్థలం ఉందని.. ఆధారాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఈడిగ బజార్‌లోని బొంత వెంకటేశ్వర్లు ఇంటి వరకు మాత్రమే గతంలో నాపరాతి బండలతో వేసిన రహదారి ఉండేదని, బైలు స్థలంలో వారికి ఎలాంటి రస్తా లేదన్నారు. అయితే గ్రామానికి చెందిన టీడీపీ



మెట్టుపల్లెలో రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటున్న మహిళలు

నాయకులు వారి కార్యకర్తల కోసం ఏళ్ల తరబడి అనుభవంలో ఉన్న తమ స్థలంలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని వాపోయారు. అలాగే ఇదే గ్రామంలో వడ్డె వెంకట నారాయణ ఇంటి ఎదురుగా వేస్తున్న రోడ్డును అడ్డుకుంటున్నారని మహిళలను స్టేషన్‌కు తరలించి రోడ్డు పనులు పూర్తయ్యాక ఇంటికి పంపించారని.. ఇదెక్కడి న్యాయమని పోలీసుల తీరుపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బైక్‌లు ఢీ..ఒకరు మృతి

- మరో ఇద్దరికి గాయాలు



వీరేష్ (ఫైల్)

కౌతాళం: ఉరుకుంద గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా..మరో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఉరుకుంద గ్రామానికి చెందిన వీరేష్ (45) ఈరన్నస్వామి ఆలయంలో టెంకాయలు కొట్టే ఒప్పంద కూలీగా ఉన్నాడు. ఇతనికి ముగ్గురు పిల్లలు. చిన్న కూతురు జయశ్రీ కౌతాళం కస్తూరిబా పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈరన్న స్వామి ఉత్సవాలను తిలకించేందుకు ఊరికి వచ్చిన కుమార్తెను మంగళవారం సాయంత్రం తిరిగి కస్తూరిబా పాఠశాలలో వదలడానికి బైక్‌పై బయలుదేరాడు. కొడుకు రమేష్‌ను కూడా వెంటబెట్టుకొని వెళ్లాడు. కుమార్తెను పాఠశాలలో వదిలి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఉరుకుంద నుంచి బదినేహాల్‌కు వెళుతున్న మంగలి రవి ద్విచక్ర వాహనం ఎదురెదురై ఢీకొన్నాయి. ఈ ఘటనలో వీరేష్ అక్కడికక్కడే మృతి చెందగా కొడుకు రమేష్‌కు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. మంగలి రవికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్త ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడు వీరేష్ భార్య గతంలోనే మృతి చెందగా ముగ్గురు పిల్లల్లో పెద్ద కూతురుకు వివాహమైంది. చిన్న కుమార్తె కస్తూరిబాలో, కొడుకు రమేష్ ఉరుకుందలోనే చదువుకుంటున్నాడు. వీరేష్ ఈరన్నస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి అక్క కూమారుడు కావడంతో సంఘటనా స్థలానికి ఆలయ అర్చకులతో పాటు సిబ్బంది తరలివచ్చారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బతికుండగానే చంపేశారు



ఫోర్జరీ పత్రాలు చూపుతున్న స్వామిదాస్

కొలిమిగుండ్ల: ఓ వ్యక్తి జీవించి ఉండగానే చనిపోయినట్లు ఫోర్జరీ పత్రాలు సృష్టించి భూమిని బదలాయించుకున్నారు.ఆలస్యంగా గుర్తించిన కుటుంబసభ్యులు అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కొలిమిగుండ్ల మండలం అబ్దులాపురం గ్రామానికి చెందిన ఏసుదాసు జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తూ హైదరాబాద్‌లో పదవీ విరమణ పొంది అక్కడే స్థిరపడ్డారు. స్వగ్రామంలో అతని పేరున 5.08ఎకరాల భూమి ఉంది. అయితే, ఈ భూమిని అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఉంటున్న జూటూరు శేఖర్‌బాబు తన కుమారుడు ప్రవీణ్ పేరున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఏసుదాసు కుమారుడు స్వామిదాస్ తెలిపారు. తన తండ్రి మృతి చెందినట్లు డెత్ సర్టిఫికెట్, తప్పుడు భూ పత్రాలు సృష్టించి అవుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సెటిల్‌మెంట్ దస్తావేజు కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వాపోయాడు. పది రోజుల క్రితం ఆన్‌లైన్‌లో భూ వివరాలు కనిపించకపోవడంతో ఆరా తీయగా వాస్తవాలు బయట పడ్డాయన్నారు. దీనిపై ఇటీవలే జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశానని, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని మంగళవారం కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన ఎల్లనాయుడు

డోన్ రూరల్: మండల పరిధిలోని ఉంగరానిగుండ్ల గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ధర్మవరం గ్రామానికి చెందిన ఎల్లనాయుడు(38) అనే వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... లారీ డ్రైవర్‌గా పనిచేసే ఎల్లనాయుడు మంగళవారం ఉదయం తన సొంత పని మీద ఉంగరానిగుండ్లకు వెళ్లాడు. జాతీయ రహదారిపై నడుచుకుంటు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఈ ఘటనలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి మృతదేహాన్ని డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య మహాలక్ష్మి, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష



కోర్టు వద్ద పోలీసులతో నిందితుడు రవి

కర్నూలు : కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని బి.తాండ్రపాడు సమీపంలో జరిగిన హత్య కేసులో నిందితుడైన కురువ బిందెల రవికి యావజ్జీవ కారాగారశిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.కబర్ది మంగళవారం తీర్పు చెప్పారు. నందికొట్కూరుకు చెందిన కురువ బిందెల రవి, పగిడ్యాలకు చెందిన ఎం.ఘనపురం గ్రామానికి చెందిన కురువ వెంకటరమణ ఇద్దరూ స్నేహితులు. రవి తన కిరాణ వ్యాపారం కోసం వెంకటరమణ నుంచి పలు దఫాలుగా రూ.16 లక్షలు బాకీ చేశాడు. ఈ బాకీ మొత్తం తీర్చాలని వెంకటరమణ ఒత్తిడి చేశాడు. దీంతో అతనిని వదిలించుకోవడానికి రవి పథకం పన్నాడు. ఇందులో భాగంగా వెంకటరమణ అత్త గారి ఊరు కర్నూలు మండలం పి.రుద్రవరంలో పంచాయితీ పెడదామని రవి చెప్పడంతో అందుకు వెంకటరమణ అంగీకరించాడు. ఈ మేరకు 2017 ఫిబ్రవరి 4వ తేదీన రవి మోటర్‌సైకిల్‌పై వెంకటరమణతో బయలుదేరి బి.తాండ్రపాడు సమీపంలోని హంద్రీనీవా కెనాల్‌కు చేరుకున్నారు. అక్కడ ఎవరూ లేరని భావించిన రవి వెంకటరమణను వెనుక నుంచి కత్తితో పలుమార్లు పొడిచి హత్య చేశాడు. ఆ తర్వాత హతుడి జేబులో నుంచి ప్రామిసరీ నోటును తీసుకుని చింపి హంద్రీనీవా కెనాల్‌లో పడేశాడు. అంతలో కొంతమంది గ్రామస్తులు అటువైపు రావడంతో రవి పారిపోయాడు. ఆ తర్వాత హతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా సీఐ మహేశ్వరరెడ్డి నిందితుడు రవిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. రవిపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ వెంకటరెడ్డి వాదించారు.

ప్రతిభను వెలికితీసేందుకే బాలోత్సవాలు

- ఈనెల 6,7వ తేదీల్లో ఇండస్ పాఠశాలలో నిర్వహణ
- ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు జి.పుల్లయ్య వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న బాలోత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు జి.పుల్లయ్య

కర్నూలు (సిటీ): పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ఏటా బాలోత్సవాలు నిర్వహించనున్నట్లు బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య తెలిపారు. నగరంలోని రవీంద్ర బాలికల పాఠశాలలో మంగళవారం ఆ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 6, 7 తేదీల్లో ఇండస్ పాఠశాల వేదికగా బాలోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు వంద పాఠశాలల నుంచి రెండు వేల మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. బాలోత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.శంకర శర్మ మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణ లక్ష్యంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కన్వీనర్ కెంగార మోహన్ మాట్లాడుతూ వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు, చిత్రలేఖనం, శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, దేశభక్తి గీతాలాపన మొదలైన 35 రకాల అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల జిల్లా అధ్యక్షుడు పీబీవీ సుబ్బయ్య మాట్లాడుతూ అన్ని పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ నైపుణ్యాలు ప్రదర్శించాలని సూచించారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి జేఎన్ శేషయ్య, అకడమిక్ విభాగం కన్వీనింగ్ కమిటీ సభ్యులు యూఆర్‌ఏ రవికుమార్, డి.ధనుంజయ, ఉత్సవ కమిటీ సభ్యులు జంధ్యాల రఘుబాబు, రంగస్వామి, రమాదేవి, జయరాజు, ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్త అరెస్ట్

తుగ్గలి : మండల పరిధిలోని రాతనకొత్తూరుకు చెందిన షేక్ మాబున్నీ హత్య కేసులో నిందితుడు అక్బర్‌వలిని పోలీసులు అరెస్ట్ చేసి కటకటాలకు పంపారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య రూరల్ సీఐ పులిశేఖర్, తుగ్గలి ఎస్‌ఐ కృష్ణమూర్తితో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. రాతన కొత్తూరుకు చెందిన మాబున్నీని 15 ఏళ్ల క్రితం చెన్నంపల్లికి చెందిన అక్బర్ వలికి ఇచ్చి వివాహం చేశారు. కొన్నేళ్ల తర్వాత భార్యపై అనుమానం పెంచుకున్న భర్త వేధింపులకు గురిచేసేవాడు. దీంతో ఆమె పుట్టింటికి చేరి అక్కడే తల్లి దండ్రుల వద్ద ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తుంది. ఈనెల 3వ తేదీన తోటకు వెళ్లి పనులు చేసుకుంటున్న మాబున్నీని..భర్త కత్తితో పొడిచి హత్య చేసి పారిపోయాడు. ఈమేరకు మృతురాలి తండ్రి షేక్ కాశీం ఫిర్యాదుతో ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనాస్థలంలో మృతురాలి వద్ద తీసుకెళ్లిన సెల్‌ఫోన్ ఆధారంగా తుగ్గలి రైల్వే స్టేషన్ దగ్గర నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు. త్వరితగతిన కేసును ఛేదించి నిందితుడిని పట్టుకున్న సీఐ, ఎస్‌ఐ, పోలీసులు సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

దుఃఖ సాగరం!

- సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎం. మద్దులేటి రెడ్డి మృతి
- ఏడు సముద్రాలు చుట్టివచ్చిన శాస్త్రవేత్త
- ప్రపంచంలోని అన్ని యూనివర్సిటీల్లో ఈయన రచించిన సముద్రశాస్త్ర పాఠాలు
- సముద్ర శాస్త్రవేత్త మృతికి సంతాపం

కర్నూలు కల్చరల్: భారతదేశంలో, ప్రపంచంలో వందలాది సముద్ర శాస్త్ర విద్యార్థులకు మార్గదర్శిగా ఉండి పరిశోధనలకు దోహదం చేసిన సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎం. మద్దులేటి రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. శాస్త్రవేత్త చేసిన సేవలను స్మరించుకుంటూ చాలా మంది దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సుద్దమళ్ల గ్రామానికి చెందిన డాక్టర్ ఎం. మద్దులేటి రెడ్డి.. భారతీయ తొలి సముద్ర శాస్త్రవేత్త. ఈయన ఏడు సముద్రాలు చుట్టివచ్చి, అనేక పరిశోధనలు చేసి, పుస్తకాలు రాసి ప్రచురించారు. ప్రపంచంలోని అన్ని యూనివర్సిటీలు సముద్ర శాస్త్రానికి సంబంధించి డాక్టర్ ఎం. మద్దులేటి రెడ్డి రచనలను పాఠ్యాంశాలుగా పెట్టుకున్నాయి. ఆయన అనారోగ్యంతో మంగళవారం ఉదయం కర్నూలులోని సన్‌రైజ్ హాస్పిటల్‌లో మృతిచెందారు. ఈయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు, కోడలు ఇద్దరు వైద్యులు. కుమార్తె, అల్లుడు విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. ఈయన ఆంధ్ర యూనివర్సిటీ నుంచి సముద్రశాస్త్రంలో తొలి డాక్టరేట్ పొందారు. కెనెడా ప్రభుత్వం పోస్ట్ డాక్టరేట్ ఫెలోషిప్‌కు ఎంపిక చేసింది. కెనడాలో ఉండి అక్కడి సముద్ర తీరంలో అనేక పరిశోధనలు చేసి పత్రాలు సమర్పించి ఆ ప్రభుత్వ ప్రశంసలు అందుకున్నారు. అనంతరం గోవాలో సైంటిఫిక్ పూల్ ఆఫీసర్‌గా పనిచేస్తూ అరేబియా సముద్రంపై పరిశోధనలు చేశారు. మంగళూరు కాలేజ్ ఆఫ్ ఫిషరీస్‌లో సుదీర్ఘ కాలం హెచ్‌వోడీగా పనిచేశారు. దేశ వ్యాప్తంగా వందలాది సముద్ర శాస్త్ర విద్యార్థులకు మార్గదర్శిగా ఉండి పరిశోధనలకు దోహదం చేశారు.

ఏడు సముద్రాలు చుట్టివచ్చిన శాస్త్రవేత్త

కెనడా ప్రభుత్వ ఆధ్వర్యంలో డాక్టర్ రెడ్డి ప్రపంచంలోని ఏడు సముద్రాలు తిరిగి పరిశోధనలు చేసి వివిధ దేశాలలో జరిగిన సెమినార్లలో పత్ర సమర్పణ చేశారు. 'ది వెటిరాన్ ఓషనోగ్రాఫర్' పేరుతో కెనడా ప్రభుత్వం అవార్డును అందించి ఈయనను సత్కరించింది. నెదర్లాండ్స్‌లోని బాల్కెమా పబ్లిషర్స్.. డాక్టర్ రెడ్డి రచించిన డిస్క్రిప్టివ్ ఫిజికల్ ఓషనోగ్రఫీని ప్రచురించింది. యూఎస్‌ఏలోని సైన్స్ పబ్లిషర్స్ వారు 'ఓషన్ ఎన్విరాన్‌మెంట్ అఫ్ ఫిషరీస్' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ప్రస్తుతం కేంబ్రిడ్జి, జపాన్, జర్మనీలలోని యూనివర్సిటీలు రెడ్డి రచించిన ఓషినోగ్రఫీ గ్రంథాలు సముద్ర శాస్త్ర విద్యార్థులకు పాఠాలుగా ప్రచురించాయి.

➡ లండన్ లైబ్రరీలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖుల పేర్లు ప్రచురించిన వరల్డ్స్ హూఈజ్ హూ, ది స్టింగ్విష్డ్ యూత్ ఆఫ్ ఇండియా అనే పుస్తకాల్లో డాక్టర్ రెడ్డికి చోటు దక్కింది. ఇండియా నుంచి పేర్కొన దగిన ముగ్గురు ప్రముఖుల్లో ఈయన ఒకరు.

సముద్ర శాస్త్రం.. సాహిత్యంపై 27 పుస్తకాల రచన

డాక్టర్ రెడ్డి మంగళూరులో అప్పటి కర్ణాటక గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య, అప్పటి ఆంధ్ర ప్రదేశ్ విద్యా మంత్రి మండలి వెంకటకృష్ణారావులతో సాహితీ సభలు జరిపారు. రిటైర్ అయ్యాక కర్నూలుకు వచ్చి తెలుగు కళా ప్రవంతిని స్థాపించారు. రచయితలు, కవులు, కళాకారులను నిత్యం ప్రోత్సహిస్తూ బిరుదులు ప్రదానం చేశారు. అవధానులు ఆశావాది ప్రకాశరావు, మద్దూరు రామమూర్తి, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య, నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్, కథా రచయిత ఇనాయతుల్లా, నంది అవార్డు గ్రహీత, గజల్ గాయకుడు మహమ్మద్ మియ్యా, బీసీ రాజారెడ్డిలకు బిరుదులు ప్రదానం చేశారు. తన ఆత్మకథతో పాటు 27 గ్రంథాలు రచించి ప్రచురించారు. తన స్వగ్రామం సుద్దమళ్లలోని అన్ని కుటుంబాల గురించి మా ఊరి ముచ్చట్లు పేరుతో గ్రంథం రచించారు. కర్నూలు జిల్లా యంత్రాంగం మద్దులేటి రెడ్డికి 2016లో ఉగాది పురస్కారం అందించింది.



సాహితీ సదస్సులో మాట్లాడుతున్న మద్దులేటి రెడ్డి (ఫైల్)

గర్వకారణమైన శాస్త్రవేత్త

➡ డాక్టర్ ఎంపీఎం రెడ్డి ఉమ్మడి కర్నూలు జిల్లాకు గర్వకారణమైన శాస్త్రవేత్త అని బనగానపల్లె అరుణ భారతి సంస్థ అధ్యక్షులు బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ రెడ్డితో ఉన్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

➡ డాక్టర్ రెడ్డి మృతి ఉమ్మడి జిల్లా సాహితీ కళా రంగాలకు తీరని లోటని గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర తెలిపారు.

➡ ఎంపీఎం రెడ్డి శాస్త్రవేత్తగా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొంది తెలుగు కళా ప్రవంతి ద్వారా జిల్లాలో ఎందరో కళా కారులు రచయితలను గుర్తించి సత్కరించి అవార్డులు బహుకరించారని తెలుగు కళా ప్రవంతి కార్యాధ్యక్షులు ఇనాయతుల్లా పేర్కొన్నారు. ఆయన మృతి తెలుగు కళా సాహిత్య రంగాలకు తీరని లోటని పేర్కొన్నారు.

- మద్దిలేటి రెడ్డి మృతి తీరని లోటని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. సముద్ర శాస్త్ర వేత్తగా, తెలుగు కళా ప్రవంతి వ్యవస్థాపకులుగా అసాధారణ సేవలు అందించారని తెలిపారు.

➡ కర్నూలు నగరం నంద్యాల రోడ్‌లోని టీవీ టవర్ ఎదురుగా ఉన్న విల్లాస్‌లో డాక్టర్ రెడ్డి స్వగృహంలో ఉంచిన రెడ్డి భౌతికకాయాన్ని ప్రముఖ రచయితలు ఎస్‌డీవీ అజీజ్, వెంకటేశ్వర రెడ్డి, ఎస్‌ఎస్ పటేల్, దస్తగిరి, ప్రముఖ ఎముకల వ్యాధి నిపుణులు డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.